

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** రాత్రి రెండవజాములోకి ప్రవేశిస్తున్నది. తన మందిరంలో వెలనాడు నుంచి పృథ్వీశ్వరుడు పంపిన తన వ్యక్తిగత వస్తువులు.. తాళ పత్ర గ్రంథాలను సరిచూసుకుంటు న్నాడు జాయచోడుడు. అంతలోనే.. ఎవరో మెట్లు ఎక్కి వస్తున్నట్లు శబ్దం! తలతిప్పి చూశాడు. చివ్వున లేచి నిలబడ్డాడు. ఎదురుగా.. గుమ్మం నిండుగా మహామండలీశ్వరుడు శ్రీశ్రీశ్రీ గణపతిదేవ చక్రవర్తి! జాయచోడుని ముఖకవళికలను మౌనంగా చూస్తూ వెళ్లి.. అక్కడున్న ఉచితాసనంపై విశ్రాంతిగా కూలబడ్డాడు గణపతిదేవుడు.

"గతంలో మాకొక పని అప్పగించావ్. అది ఏమైందో తెలుసుకున్నావా!? మీ అక్క నైనా అడిగావా!? నిన్ను చూడగానే.. అయ్యవంశం వారినందరినీ పేరుపేరునా తలు చుకుంటూ.. పరస్పరం కొత్తకొత్త కబుర్లు, ముచ్చట్లు. ఇక మీ ఇద్దరికీ రాజ్యం.. కుటుంబం.. పిల్లలు.. వాళ్ల పెళ్లిళ్లు.. ఏమి గుర్తుంటాయి?!''.. ప్రశ్నల బాణాలు వదులుతూనే ఉన్నాడు చక్రవర్తి.

చేతులు వెనక్కు కట్టుకుని అటూ ఇటూ కదలుతు న్నాడు జాయపుడు.

ఆయన కదలికల్లో ఆ ముద్రలు, స్థానకాలు, రేచ కాలు, కరణులు అదిరిపోతున్నాయి. ఏకపాద లక్షణం.. పాదాల కదలిక.. వళితం.. ఓహో త్రిభంగి.. భలే.. మర్దితం.. ఘట్టితం.. తాడితం!! నృత్తంలో పాద కదలి కలు అన్నీ ప్రభువులకు తెలిసినట్లుంది.

''పాపాల భైరవుణ్ని నేనొకణ్ని ఉన్నాను కదా.. అత గాడే చూసుకుంటాడని.. మీ ధీమా!''.

ఏమిటన్నాడు? పిల్లల పెళ్లిళ్లు అన్నాడు కదూ.. గతంలో తనే గణపాంబ వివాహం ప్రస్తావించాడు. గణ పాంబ పెళ్లి నిశ్చయమైంది. నువ్వొచ్చి పెళ్లి చెయ్యాలని రాశాడేమో.. వచ్చిననాడు అక్క ప్రస్తావించింది కూడా.. ఆరోజు ఆ లేఖను చూడలేదు.

మాటల్లేవ్.. మాట్లాడుకోడాల్లేవ్. నిశ్శబ్దం మరీ లావ వుతున్నది. ఎవరో ఒకరు మాట్లాడకపోతే నరాలు చిట్లి పోయేలా ఉన్నాయి. ముక్కుపొడుం పీల్చి కూర్చున్నట్లు ఆయన కిక్కురుమనడంలేదు. తాపీముని! పెంచిన గెడ్డం నిమురుకుంటూ కూర్చున్నాడు.

ఇక తను మాట్లాడక తప్పదు.

''అదే.. అది.. అదే.. ఆ.. ద.. గణ.. అక్క.. సోమ.. లక్క!''..

ఒక్క వాక్యం కుదిరితే ఒట్టు. కొన్ని పదాలు.. పదాలు కూడా కాదు.. కొన్ని శబ్దాలు!!

భారంగా లేచాడాయన. హమ్మయ్య నృత్తం ముగిం పునకు వచ్చింది. ఇక యవనిక మౌనంగా వాలును. కది లాడు. గుమ్మంవైపు తిరిగాడు. అప్పుడు మళ్లీ విశాలంగా సగం వెనుదిరిగాడు.

''అవునూ.. మమ్మల్ని ఎందుకు తప్పించుకు తిరుగు తున్నారు మండలీశ్వరా.. మేము చేసిన తప్పు..??''.

తప్పుచేసినట్లు ఆయనే అడగడంతో హిమాలయ మంత మంచుపర్వతం బుడుంగున పేలి ప్రవహించి అనుమకొండ వరకూ వచ్చేసింది. కానీ, తట్టుకుని నిలబ డ్డాడు జాయచోడుడు.

''నేనొక డప్పువాద్యగాణ్ని ద్వీపం నుంచి మీకోసం పంపాను. అతణ్ని మీరు గౌరవించకపోగా.. అవమా..''